అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా

- డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ
- ఇప్పటికే మూడు విడతల్లో నగదు బ్యాంకు ఖాతాల్లో జమ
- నాలుగో విడత పంపిణీకి కసరత్తు


స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశం (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): స్వయం సహాయక సంఘాల అక్క, చెల్లెమ్మలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే మహిళలను ఆదుకునేందుకు రుణమాఫీకి చర్యలు చేపట్టారు. స్వయం సహాయక సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల రుణాల మాఫీకి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల్లో బ్యాంకుల్లో జమ చేయగా త్వరలోనే నాలుగో విడత జమ చేసేందుకు కసరత్తు పూర్తి చేశారు. ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ పథకం తమకు ఎంతో మేలు చేస్తోందని డ్వాక్రా సంఘాల మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పథకం లక్ష్యం ..

వైఎస్సార్ ఆసరా పథకం స్వయం సహాయక బృందాల ఉత్పాదకను మెరుగుపరచడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో బకాయి రుణాలను తిరిగి చెల్లించేందుకు దోహదపడుతోంది. పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ స్వయం సహాయక బృందాల మహిళలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఉన్న రుణాలను ప్రభుత్వం నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మండలంలోని అన్ని స్వయం సహాయ సంఘాలకు చెందిన సభ్యుల ఖాతాల్లో ఈ సొమ్ములను నేరుగా ప్రతి ఏడాది జమ చేస్తున్నారు.

జీవనోపాధి పెంచేలా శిక్షణ

ఈ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణతో పాటు వ్యాపార రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో రుణ బకాయిలు తొలగించడం ద్వారా మహిళలకు ఆర్థిక ఉపశమనంతో పాటు వ్యాపారాల అభివృద్ధికి మద్దతు లభిస్తోంది.

వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల వివరాలు...

నియోజకవర్గం	2020-21	2021-22	2022-23	మొత్తం లబ్ధి (రూ.లలో)
ఆళ్లగడ్డ	3,022	3,045	3,044	626.59 కోట్లు
నంద్యాల	1,988	2,002	2,001	279.74 కోట్లు
బనగానపల్లె	4,234	4,282	4,282	848.94 కోట్లు
నందికొట్కూరు	4,063	4,072	4,072	818.96 కోట్లు
పాణ్యం	1,335	1,346	1,346	191.85 కోట్లు
శ్రీశైలం	3,202	3,227	3,227	643.46 కోట్లు
డోన్	3,015	3,033	3,029	534.68 కోట్లు

మహిళలకు ఎంతో మేలు



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సభ్యులకు ఎంతో మేలు చేకూరింది. ఇప్పటికే మూడు విడతలు చెల్లించాం. త్వరలోనే నాలుగో విడత కూడా బ్యాంకుల్లో జమచేయడం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశానుసారం లబ్ధిదారుల ఎంపికపై సర్వే జరుగుతుంది. అర్హులందరికీ పథకం వర్తిస్తోంది.

–శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

జగనన్నకు రుణపడి ఉంటాం



బ్యాంకుల్లో బకాయి పడ్డ అప్పును ప్రభుత్వమే విడతల వారీగా తీర్చడం హర్షణీయం. మా రుణాలను తీర్చడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. డ్వాక్రా సంఘ సభ్యులకు రుణాలు ఇప్పించడంతో జీవనోపాధులు మెరుగుపడుతున్నాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– జి.లక్ష్మిదేవి, మహానంది

ఆర్థికంగా భరోసా



ప్రస్తుతం ప్రభుత్వం మా అప్పులను తీర్చడంతో ఆర్థికంగా మాకు ఎంతో భరోసా కల్పించింది. ఆ సొమ్ము మేము ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహద పడుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరా పథకం మాలాంటి వాళ్లకు ఎంతో ఉపయోగపడుతుంది. అప్పులు తీరడంతో ఆనందంగా ఉంది.

–షేక్‌షబానా, బండిఆత్మకూరు

క్లుప్తంగా

తిరుమలకు పాదయాత్ర


పాదయాత్రగా బయలు దేరిన భక్త బృందం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీ ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం నుంచి శ్రీ గణేష్ భక్త బృందం సభ్యులు లోక కల్యాణం కోసం మంగళవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ముందుగా వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. బృందం సభ్యులు చలం బాబు, రజినీ కాంత్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. పాదయాత్ర రోజుకు 35 కిలోమీటర్లు నడుస్తూ 8వ రోజున తిరుమల చేరుకుంటుదని చెప్పారు. బృందంలో 15 మంది పాదయాత్ర చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుధాకర్, గోపీ నాథ్, రమణ, హరి సత్యనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

నంద్యాలటౌన్: ఆర్టీసీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభమైనట్లు జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న డిపోల్లోని డ్రైవర్లకు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, సురక్షిత ప్రయాణం కొరకు పాటించవలసిన నియమాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఆర్టీసీ పనిచేస్తుందన్నారు.

సెలవు రోజుల్లో బస్సు నడపండి

నంద్యాల(న్యూటౌన్): సెలవు రోజుల్లో కూడా కోవెలకుంట్ల నుంచి వివిధ పల్లెల మీదుగా నంద్యాలకు బస్సు నడపాలని ప్రయాణికులు, విద్యార్థులు ఆర్టీసీ అధికారులను కోరారు. మంగళవారం లింగాల, తేళ్లపూరి, మిట్నాల గ్రామాల ప్రజలు ప్రయాణికులు మాట్లాడుతూ ఆదివారం సెలవు కాగా, పండుగ సెలవులు వస్తే బస్సు నడపకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పండుగలకు, సెలవు రోజుల్లో గ్రామాలకు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. కోవెలకుంట్ల డిపో అధికారులు స్పందించి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని బస్సునడపాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయరెడ్డి

ఉయ్యాలవాడ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా రామాంజనేయ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను ఉన్నతాధికారులు నంద్యాలకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో డోన్ సబ్‌డివిజన్ పరిధిలోని నందివర్గం ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామాజంనేయరెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

న్యాయవ్యవస్థ ద్వారానే ప్రజలకు న్యాయం

నంద్యాల(న్యూటౌన్): ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన న్యాయవ్యవస్థ ద్వారానే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ న్యాయపరిజ్ఞానం లేని రెవెన్యూ అధికారులు ప్రజల ఆస్తులు, హక్కులు నిర్ధారించే చట్టాన్ని అమలు చేస్తే చిన్న సన్నకారు రైతులు ఇబ్బందులుపడే పరిస్థితి ఉందన్నారు. భూహక్కు చట్టంపై రెవెన్యూ అధికారులు పెత్తనం తగదన్నారు.

నేడు ఆర్.పాంపల్లెకు ఎమ్మెల్యే రాక

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామానికి బుధవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొండుపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని ఆర్.పాంపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తారని వెల్లడించారు. కావున మండల స్థాయి అధికారులందరూ మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాలన్నారు.

మహానందిలో న్యాయమూర్తులు

మహానంది: అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మహానందికి వచ్చారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలాగే గుంతకల్లు సీనియర్ సివిల్ జడ్జి మంజుల, రైల్వే కోడూరు సీనియర్ సివిల్ జడ్జి అంజనా ప్రియదర్శిని వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. స్థానిక యాగశాలలో న్యాయమూర్తులకు ప్రసాదాలు అందించారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి పారువేట


స్వామివారికి మొదటి పూజ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి లీలావతిబాయి దంపతులు, సర్పంచ్ సరోజమ్మ

చాగలమర్రి: వైఎస్సార్‌జిల్లా రాజుపాళెం మండలం, వెల్లాల గ్రామంలోని సంజీవరాయస్వామి ఆలయంలో వెలసిన వెల్లాలా చెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత, శివ, గంగా, పార్వతుల విగ్రహాలతో పారువేట కార్యక్రమం కనుమ రోజైన మంగళవారం మండలంలోని మల్లెవేముల గ్రామంలో వైభవంగా సాగింది. ఇందులో భాగంగా భారీ భక్తజనసందోహం మధ్య స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వార్ల రథాలు ప్రధాన కూడలి వద్దకు రాగానే స్వామివారి ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు, వారి శిష్య బృందం సభ్యులు చక్రపాణి, వెంకటచలపతి, శ్రీధర్‌ల వేదమంత్రోచ్ఛరణలతో మల్లెవేముల గ్రామ పంచాయతీ కార్యదర్శి లీలావతిబాయి దంపతులు, సర్పంచ్ ఈడుల సరోజమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు సాంప్రదాయ బద్ధంగా స్వామికి ప్రత్యేక మొదటి పూజను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులందరూ పూజలను నిర్వహించి, స్వామిని దర్శించుకున్నారు. గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. వెల్లాల గ్రామంలో ప్రారంభమైన పారువేట ఉత్సవం అదే రోజున వైఎస్సార్ జిల్లాలోని గోపాయపల్లె, మల్లెవేముల, దద్దనాల, పగిడేల, కుమ్మరిపల్లె, పర్లపాడు గ్రామాలలో పర్యటించి తిరిగి అదే రోజున వెల్లాలకు చెరుకోవడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు బలరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ నాయకులు జ్యోతీశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, స్వామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొడిగనురులో గ్రామోత్సవం..

మండలంలోని గొడిగనూరు గ్రామంలోని శ్రీపట్టాభిసీతారామస్వామివారి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పారువేట సందర్భంగా గొర్రెను వదలగా గ్రామానికి చెందిన యవకులు దానిని పట్టుకునేందుకు ఉత్సాహంగా పరుగుతీశారు. అలాగే ముత్యాలపాడు గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం గ్రామంలో వెలసిన మూర్తి లక్ష్మీనరసింహ్మస్వామి, చెంచులక్ష్మి, లక్ష్మీదేవి, గరుత్మంతుడి విగ్రహాలను పల్లకీలో కొలువుంచి గ్రామోత్సహాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వరికూటి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్వామి వారి పల్లకీని సాంప్రదాయ రీతిలో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు జయరాముడు, మంచి కంటి గోపాల్, బింగుమళ్ల రామశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం


భక్తజన సందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో సంజీవనగర్ రామాలయం, శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం అంగరంగ వైభవంగా రథోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని రథంపై ఆశీనులు గావించి దేవాలయ ఆవరణ నుంచి బయల్దేరింది. రథోత్సవంతో పట్టణంలో రోడ్లన్నీ గోవింద నామంతో మారుమోగాయి. చెక్కభజనలు, కీలు గుర్రాలు, మైసూరు నుంచి వచ్చిన ఛండ మేలం ప్రదర్శన, శ్రీసాయి నాట్యాంజలి నాట్య ప్రదర్శన, దేవతా వేషధారణలో చిన్నారులు, పార్నపల్లె కోలాట బృంద ప్రదర్శన, మహిళలచే అన్నమయ్య కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రథోత్సవం సంజీవనగర్, శ్రీనివాసనగర్, నాగులకుంట రోడ్డు, గాంధీచౌక్ గుండా దేవాలయానికి చేరుకుంది. డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భగవత్ సేవా సమాజ్ సభ్యులు సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాస్, మధుసూదన్, సుబ్రహ్మణ్యం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తానని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తానని వాగ్దానాలు చేసి హామీలను తుంగలో తొక్కారన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ కోశాధికారి చౌడప్ప, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రఫి, ఖాజామియా, పఠాన్ శారుక్ తదితరులు పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవాల్లో ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ : అహోబిలేశుడి పార్వేట మహోత్సవాల్లో ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు. దిగువ అహోబిలం దేవాలయం చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పార్వేట పూజలు అనంతరం వేద పండితులు స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం ఎమ్మెల్యే స్వామి ఉత్సవ పల్లకీని దేవాలయం బయటివరకు మోసుకు వచ్చి పర్వేట ఉత్సవాలను ప్రారంభించారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్ నాసారి వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్వేట మహోత్సవంలో అపశృతి

లక్ష్మీనరసింహస్వామి పార్వేట మహోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. పల్లకీ మోస్తున్న వ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందాడు. మంగళవారం దిగువ అహోబిలంలో పార్వేట ఉత్సవ పల్లకీకి పూజలు ముగించుకుని భక్తులు భుజంపై మోసుకొని గుడి బయటకు తోడ్కొని వచ్చారు. భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో కొంత తోపులాట జరిగింది. ఈ క్రమంలో పల్లకీ మోస్తున్న ముత్తులూరు గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి (50) ఒత్తిడికి లోనై గుండెలో నొప్పిరావడంతో కుప్పకూలి పోయాడు. హుటాహుటిన ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బీజేపీ, టీడీపీ నాయకుల ఘర్షణ

ఆళ్లగడ్డ : పట్టణంలో బీజేపీ, టీడీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షనకు సంబంధించి టీడీపీకి చెందిన ఏడుగురిపై కేసు నమోదయ్యింది. పట్టణంలోని కర్నమయ్య వీధికి చెందిన బీజేపీ నాయకుడు గంగాధర్‌రెడ్డి ఇంటి పక్కనే ఉన్న టీడీపీ చెందిన శ్రీనివాసులు మధ్య నాలుగు రోజుల క్రితం మాటామాటా పెరిగి ఘర్షన పడ్డారు. ఈ క్రమంలో సోమవారం గంగాధర్‌రెడ్డి శ్రీనివాసులు ఇంటికి వెళ్లి మరోసారి గొడవపడ్డాడు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో శ్రీనివాసులు గంగాధర్ తలపై కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గంగాధర్‌రెడ్డి గాయడప్డ విషయం తెలుసుకుని అతని బంధువులు శ్రీనివాసులు గడ్డివామిని దగ్ధం చేశారు. అయితే గంగాధర్‌రెడ్డి పై దాడి చేసిన ఘటనకు సంబంధించి శ్రీనివాసులుతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపారు.

నేడు నంద్యాలకు రైల్వే ఏజీఎం

నంద్యాల(సిటీ): నంద్యాల రైల్వే స్టేషన్‌ను ఏజీఎం సౌత్ సెంట్రల్ రైల్వే (అడిషనల్ జనరల్ మేనేజర్) ఆర్.ధనుంజయులు బుధవారం పరిశీలించనున్నారని నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ ఎస్.దొరస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల రైల్వే స్టేషన్ సందర్శన అనంతరం నంద్యాల–ఎర్రగుంట్ల రైల్వే లైన్ ట్రాక్‌ను ఆయన పరిశీలించనున్నట్లు చెప్పారు. అలాగే ఈ నెల 18వ తేదీన ఎస్‌డీజీఎం సౌత్ సెంట్రల్ రైల్వే(సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్) అరవింద్ మల్‌ఖేడే నంద్యాల రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తారన్నారు. అదేవిధంగా గుంటకల్–డోన్–గుంటూరు డివిజన్ల మధ్యలో జరుగుతున్న డబ్లింగ్ పనులను, నంద్యాల, డోన్, జంగంభొట్ల కృష్ణాపురం స్టేషన్లు పరిశీలిస్తారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన


అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి, మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు తరలిరండి


మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ రావు

నంద్యాల(అర్బన్): సామాజిక న్యాయానికి నిలువెత్తు రూపమైన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రూ.400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సోమవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున స్వరాజ్‌మైదానంలో రూ.2 వేల కోట్లు విలువ చేసే 20 ఎకరాల విస్తీర్ణంలో దేశంలోని ఎత్తైన విగ్రహాల్లో మూడవ స్థానంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమన్నారు. ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్లు, ఫేస్‌బుక్, ఇంస్టాగామ్‌ల ద్వారా విగ్రహావిష్కరణ కార్యక్రమం గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు గౌరవ అధ్యక్షుడు లింగస్వామి, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ డైరెక్టర్ సునీతా అమృతరాజ్, రాజ్‌కుమార్, దేవదాసు, ప్రేమ్‌కుమార్, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు


యాళ్లూరులో శ్రీ ఉమా సహిత నీలకంఠేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీమాధవ స్వామి ఊరేగింపు

దొర్నిపాడు: మండలంలో సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు అంత్యంత వైభవంగా జరుపుకున్నారు. రామచంద్రాపురం, భాగ్యగనగరం, అమ్మిరెడ్డినగరం, వెంకటేశ్వరనగరం, ఉమాపతినగరం గ్రామాల్లో కోస్తా ప్రాంతం కోలాహలం కనిపించింది. రామచంద్రాపురంలో సీతారాముల కల్యాణం అనంతరం గ్రామోత్సవం, గ్రామంలోని కుంటలో తెప్పోత్సవం నిర్వహించారు. సందర్భంగా ఊరంతా అక్కడికి చేరుకొని స్వామివార్లను దర్శించుకున్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో సంక్రాంతి సంబరాలు విజయవంతంగా ముగియడంలో ముఖ్యపాత్ర పోషించిన వెంకటేశ్వర్లు, సునీత, నరసింహులను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం వీరికి బహుతులను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటరమణయ్య, నరేష్, నాయుడు, మురళీ, సూర్యకుమారి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడలో ఆటల పోటీలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి పండుగను సోమ, మంగళవారాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కనుమ రోజు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి విందు భోజనాలు ఆరగించారు. ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యువకులకు పరుగుపందెం పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన చాకలి సురేష్‌కు ప్రోత్సాహ బహుమతి అందజేశారు. సీతారాములు, శివపార్వతులు, కోదండ రామ ఉత్సవ మూర్తులను పల్లకీలో వుంచి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాల మాజీ ధర్మకర్త ఖాతా దస్తగిరిరెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పారువేట

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో మంగళవారం సంక్రాంతి పండుగను సంబరంగా జరుపుకున్నారు. వృత్తి రిత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్నవారంతా స్వగ్రామాలకు చేరుకోవడంతో కళ సంతరించుకుంది. రుద్రవరంలో భాస్కర నందీశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి, చిన్నకంబలూరులో చెన్నకేశవస్వామి, బీరవోలులో వేణుగోపాల స్వామి వారికి పారువేట ఉత్సవం నిర్వహించారు. రుద్రవరంలో యువతకు పరుగు పోటీలు, చిన్నకంబలూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు.


రామచంద్రాపురంలో సీతారాముల గ్రామోత్సవం

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో వైభవంగా సంక్రాంతి సంబరాలు ప్రజలు జరుపుకున్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో సోమవారం శ్రీ మాధవ స్వామి, మంగళవారం రోజున యాళ్లూరులో శ్రీ ఉమా సహిత నీలకంఠేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ మాధవ స్వామి, ఎం.చింతకుంట్ల గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి, ఎం.కృష్ణాపురం గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే గోస్పాడులో శివుడు, పార్వతి, గంగా, రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల, సీతారామ ఆంజనేయస్వాముల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు మహోత్సవాన్ని చేపట్టరు.


చాబోలులో పారువేట ఉత్సవం

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు: 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపాల్ తెలిపారు. స్థానిక ప్రాథమిక కేంద్రంలో మంగళ వారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే ఆరోగ్య సురక్ష మొదటి విడత వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. రెండో విడత వైద్య శిబిరాలను ఈ నెల 19న దీబగుంట్ల, 23న కానాలపల్లి, 30న యాళ్లూరు-2, ఫిబ్రవరి 6వ తేదిన సాంబవరం, 16న యాళ్లూరు-1, 20న ఎం.క్రిష్టాపురం. 27న నెహ్రూనగర్, మార్చి 5న పసురుపాడు, 19న ఒంటి వెలగల, 26న జూలేపల్లి గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ

నంద్యాల(వ్యవసాయం): మన ఊరు–మన గుడి సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు దేవాలయాల్లో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ నిర్వహించారు. స్థానిక కోట వీధిలోని సోమనందీశ్వర స్వామి ఆలయం, నూనెపల్లె అమ్మవారి శాల పరిసరాలు, గోపురాలు, ఉత్సవ మూర్తులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలను శుభ్రపరచడం పుణ్య కార్యక్రమమన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు పట్టణంలోని బ్రహ్మనందీశ్వర ఆలయం, స్టేట్ బ్యాంక్ కాలనీ రామాలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, కాళికాంబా దేవాలయం, బైటిపేట ఆంజనేయ స్వామి దేవాలయాలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు నెరవాటి వినోద్ కుమార్, సౌజన్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుస్తీ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా అమెచ్యూర్ రెస్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్టేడియంలో జిల్లా స్థాయి కుస్తీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం సెక్రెటరీ రాబర్ట్ మంగళ వారం తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలను ఈ నెల 20, 21 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు పంపుతామన్నారు. క్రీడాకారులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో రావాలని జిల్లా రెస్లింగ్ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు తెలిపారు. పురుషుల ఫ్రీస్టైల్, గ్రీకోలో విభాగాల్లో, మహిళల ఫ్రీస్టైల్ విభాగాల్లో వివిధ బరువుల కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మరింత సమాచారం కోసం 9676095979 నంబరును సంప్రదించాలన్నారు.

ఘనంగా ఆర్మీడే


కార్గిల్ యుద్ధ వీరుడిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఆర్మీ డేను పురస్కరించుకుని బీజేపీ కార్యాలయంలో మంగళవారం కార్గిల్ యుద్ధవీరుడు జవాన్ రమణను ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు మేడ మురళీధర్, అభిరుచి మధు మాట్లాడుతూ దేశ రక్షణలో సైన్యం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కుటుంబాలను విడిచి నిద్రాహారాలు మానుకుని దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్ల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కశెట్టి చంద్రశేఖర్, కేతుపల్లె చంద్రశేఖర్, రమేష్, ఉపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు పోరాటాలకు సిద్ధం కావాలి

నందికొట్కూరు: బీసీలు రాజ్యాధికారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, జిల్లా అధ్యక్షులు కురుమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ కోసం మరో స్వతంత్ర్య పోరాట రథయాత్ర చేపడుతునట్లు చెప్పారు. ఈ నెల 18న తేదీన సాయంత్రం నాలుగు గంటలకు జమ్మి చెట్టు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభిస్తునట్లు తెలిపారు. పట్టణంలో ప్రధాన రహదారి, పురవీదుల వెంట బీసీ రథయాత్ర కొనసాగుతుందని చెప్పారు. రథయాత్రకు బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.